www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 16 సెప్టెంబర్ 2025



జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'మాధురి' విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశకి-సుండుపల్లి

కర్నూలు జిల్లాలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక మాధురి స్కూల్ విద్యార్థులు పాల్గొని వాళ్లదైనా శైలిలో ప్రతిభను కనపరిచి పతకాలను సాధించారు. ఇందులో నవదీప్ నాయక్ 6 తరగతి గోల్డ్ మెడల్, విజయలక్ష్మి 7వతరగతి సిల్వర్ మెడల్, అనంతరామ్ 7 తరగతి బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాల చైర్మెన్ డాక్టర్ రేపన సుధాకర్ అభినందించారు. అనంతరం విద్యార్థులతో ఉద్దేశించి మాట్లాడుతూ ఇటువంటి పతకాలను మరి ఎన్నో సాధించాలని, చదువు పైన కూడా క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రనాయక్ కరాటే మాస్టర్ దేవేంద్ర కుమార్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో కడప, అన్నమయ్యకు సి గ్రేడ్

- హార్టీకల్చర్‌లో లింగాల ప్రస్తావన
- పారిశ్రామిక, సర్వీస్‌లూ అంతంతే
- విజయవాడలో సిఎం విజన్-2047 సమీక్ష

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా తలసరి ఆదాయం (జిడిపి) వృద్ధిని పెంపు ఆధారంగా ప్రభుత్వం కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తోంది. వ్యవసాయం, పారిశ్రామికం, సర్వీస్ రంగాలవృద్ధి ఆధారంగా లభించిన తలసరి ఆదాయాన్ని గణన చేస్తోంది. స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి కడప జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీస్ రంగాల నుంచి తలసరి ఆదాయం రూ.63,47,871 కోట్ల నుంచి రూ.54,60,748 కోట్లకు పెంచాలనే లక్ష్యాల్ని నిర్దేశించుకుని ముందుకెళ్తోంది. పారిశ్రామిక, సర్వీస్ సెక్టార్లలో అసాధారణ లక్ష్యాల్ని నిర్దేశిం చుకుంది. సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధి తొలిక్వార్టర్‌లో కడప, అన్నమయ్య జిల్లాలు హార్టీకల్చర్ మినహా మిగిలిన పారిశ్రామిక, సర్వీస్ రంగాలు సాధించిన స్కోర్లలో ఆశించిన పురోగతి కనిపించ కపోవడం ఆందోళన కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లా వ్యవసాయ రంగంలో రూ.48,677 కోట్లు సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. 17.42 శాతం సాధిం చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తొలిక్వార్టర్‌లో రూ.9,960 కోట్లు సాధించాలనే లక్ష్యానికి గానూ20.46 శాతం సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. కడప జిల్లాలో రూ.73,217 కోట్ల లక్ష్యాని కిగానూ 18.16 శాతం వృద్ధిరేటు సాధిం చాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈఏడాది తొలి క్వార్టర్‌లో రూ.13,149 కోట్ల ఆర్జన లక్ష్యానికి 17.96 శాతం సాధించాల్సి ఉంది. స్వర్ణాంధ్ర జిల్లాల స్కోర్లలో కడప జిల్లా 62 స్కోర్లతో బి గ్రేడ్, అన్నమయ్య జిల్లా 59 గ్రేడ్లతో బి గ్రేడ్ సాధి ంచింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో కడప జిల్లా 27 స్కోర్లతో సి గ్రేడ్, అన్నమయ్య జిల్లా 25 స్కోర్లతో సి గ్రేడ్‌కు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. సహకరించే అంశాలు, వ్యూహాత్మక పాయింట్ల ఆధారంగా లింగాల మండలంలోని కోమన్నూతల గ్రామం అనుకూలతలు కలిగినదిగా గుర్తింపును దక్కించుకుంది. పంటలు మొదలుకుని ప్రతిఉత్పాదనకు జివిఎను కలిపి లెక్కించడం గమనార్హం. వీటితో పాటు మైనింగ్, క్వారీయింగ్, తయారీరంగం, విద్యుత్, నీటి సరఫరా నిర్మాణం తదితర పారిశ్రామిక రంగాల క్వార్టర్ల వారీ వృద్ధికి జివిఎను కలిపి లెక్కించారు. ఇండస్ట్రీ సెక్టార్‌లో అన్నమయ్య జిల్లా 80 స్కోర్లతో ఎగ్రేడ్, కడప జిల్లా 42 స్కోర్‌తో సిగ్రేడ్‌కు పరిమితమైంది. సర్వీస్ సెక్టార్‌లో కడప జిల్లా 76 స్కోర్‌తో ఏగ్రేడ్, 68 స్కోర్ రేటింగ్‌తో బి.గ్రేడ్‌కు పరిమితమైంది.


సిఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

వైద్య కళాశాలను ప్రభుత్వమే నడపాలి

- సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నాలో విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె వైద్య కళాశాలను ప్రభుత్వ అధీనంలోనే నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాలు, మదనపల్లె అభివద్ధి వేదిక, విద్యార్థులతో కలిసి సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని నినాదాలు చేశారు. 107, 108 జిఒలను రద్దు చేసి పేద, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పి3 విధానంలో మెడికల్ కళాశాల నిర్వహించడమంటే పేద బడుగు బలహీన విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనని చెప్పారు. పేదలకు వైద్యం అందని ద్రాక్ష తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలకు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దతు తెలియజేస్తూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి సాహెబ్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలో నిర్మించాలన్నారు. పిపిపి విధానం ద్వారా పేద బలహీన వర్గాల ప్రజలకు వైద్య విద్య దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ద్వారా బలహీన వర్గ విద్యార్థులు రిజర్వేషన్ల పొందే హక్కు కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చిత్తూరు మెడికల్ కళాశాలను అపోలోకు కేటాయించడంతో పేద ప్రజలకు ఒపి వద్ద నుండి మందుల వరకు ప్రతి సేవ ఖర్చుతో కూడుకొందన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాల కూడా పిపిపి విధానం ద్వారా నిర్మించడమంటే పేదలకు వైద్యం, పేద విద్యార్థులు వైద్య విద్య దూరం చేయడమే తప్ప మరొకటి కాదన్నారు. ఈ ప్రాంతంలో చదువుకుంటున్న నర్సింగ్, ఒకేషనల్ కోర్స్, పారా మెడికల్, ఫార్మసీ ఇతర వత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఉపాధి కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వాటికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్‌లో మెడికల్ కళాశాల ఉండాలన్న దష్టితో 17 మెడికల్ కళాశాలలను తీసుకురాగా ఏడు కళాశాలలకు ఎంసిఐ అనుమతులు లభించాయని చెప్పారు. పులివెందుల తదితర కళాశాలలకు ఎంసిఐ అనుమతులు ఇస్తే కూటమి ప్రభుత్వం అవకాశాన్ని వినియోగించుకోకుండా వద్దని లేఖ రాసి, ప్రయివేట్‌పరం చేయాలనుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రయివేటు వెనుక వాణిజ్యపు లాభం, కమీషన్ల కోరిక తప్ప ప్రజలపై బాధ్యత అనే భావన లేదని విమర్శించారు. ఒక మెడికల్ కళాశాల నుంచి రూ.500 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల వరకు కమీషన్లు తీసుకునేటటువంటి ప్రక్రియలో భాగంగానే ప్రయివేట్ పరం చేయాలనుకోవడం వేలాది పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లడమేనన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సంపత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అఫ్రిద్, జయబాబు, సిపిఎం నాయకులు నాగరాజు, ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి, ఇతర ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- నూతన ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని అసాంఘిక శక్తులకు, రౌడీలకు ఇదే తన చివరి హెచ్చరిక అని అన్నమయ్య జిల్లా నూతన ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన సతీ సమేతంగా తన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్ర స్వామి ఆలయ ఇఒ డివి రమణారెడ్డి, అర్చకులు నూతన ఎస్‌పికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం నూతన ఎస్‌పికి అడిషనల్ ఎస్‌పి వెంకటాద్రి, ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, డిఎస్‌పిలు, ఎస్ఐలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ప్రజల శాంతి భద్రతల విషయంలో వంద శాతం రక్షణగా నిలుస్తానని పేర్కొన్నారు. చారితాత్మకమైన జిల్లా అన్నమయ్య జిల్లా అని తెలిపారు. ఇక్కడ అధికంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఉన్నారని బయటవారిని ఆదరించే ప్రాంతమని పేర్కొన్నారు. అందరి సహకారంతో అన్నమయ్య జిల్లాలో మత్తు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా అన్నమయ్య జిల్లాను తీర్చిదిద్దుతాని తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పోలీసులపై నమ్మకంతో సమస్య పరిష్కారం కోసం ప్రజలు వసుంటారని, పోలీసు అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. కుటుంబ కలహాలు సైబర్ మోసాలు భూ ఆస్తి వివాదాలు నకిలీ పత్రాలు అధిక వడ్డీలు ఆన్‌లైన్, ప్రేమ పేరుతో మోసం లాంటి సమస్యలపై ఆయనే స్వయంగా విచారణ జరిపి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

టమోటా, బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో కాంగ్రెస్ నాయకులు


డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని టమోటా, బొప్పాయి రైతులు ప్రస్తుతం తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే గిట్టు బాటు ధరలు కలించాలి అని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అనంతరం డిఆర్ఒ మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బొప్పాయి, టమోటాకు గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మార్కెట్లలో దళారీ వ్యవస్థ కారణంగా రైతులు మోసపోతూ, వారి కష్టార్జిత పంటకు సరైన ధర లభించడం లేదన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, రైతుల కన్నీరు తుడవాల్సిన బాధ్యతను విస్మరిస్తోందని వారు విమర్శించారు. బొప్పాయి పంట పరిస్థితి మరింత దారుణంగా మారిందిన్నారు. పండించిన పంకు గిట్టుబాటు ధర లేక, కనీసం కూలీ, రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోయారు.. రైతులు తాము కష్టపడి పండించిన బొప్పాయి పండ్లను మార్కెట్‌కి తీసుకెళ్లినా అమ్ముడుపోక, రోడ్లమీద వేసేయాల్సి వస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి రైతుల పరిస్థితి కూడా ఇటీవలే చేదు అనుభవాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తోతాపూరి మామిడి రకానికి రూ.4 సబ్సిడీ ఇస్తామని చెప్పినా, ఇప్పటికీ వరకు రైతులకు అందలేని వాపోయారు. పైగా, మామిడి పంటకు ఇన్సూరెన్స్ పేరుతో రైతుల దగ్గర డబ్బులు కట్టించుకున్నా ఎటువంటి లాభం కలగలేదన్నారు. ఈ కారణంగా కొంతమంది రైతులు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల ఆత్మహత్యల వరకు వెళ్ళే పరిస్థితి తలెత్తుతోందిన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రలోనే ఉందన్నారు. ప్రభుత్వం మేల్కొని, రైతుల సమస్యలను గమ నించి, గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ దుగ్గనపల్లి సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాయచోటి చెన్న కృష్ణ,గిరిబాబు, వెంకట రమణ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- సబ్ కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు


నిందితుడు నరసింహులు (ఫైల్)

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : సెలవు రోజు కావడంతో వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి ఆవులను మేపుకుం టున్న 13 సంవత్సరాల బాలికపై స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మదనపల్లె మండలంలోని ఓ గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాలిక తల్లిదండ్రులు సబ్ కలెక్టర్‌కు, తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక మదనపల్లె పట్టణంలో ఓ ప్రయివేటు పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. రెండో శనివారం పాఠశాలకు సెలవు కావడంతో ఆవులను పట్టుకుని పొలం వద్దకు వెళ్లింది. అదే సమయంలో గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న బాలికను గమనించాడు. శబ్దం చేయకుండా మెల్లగా అక్కడికి వెళ్లి, బాలిక నోరు అదిం పెట్టి, చెట్లు పొదలులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెప్పావంటే చంపేస్తానని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్ళిన బాలిక చప్పుడు చేయకుండా ఓచోట పడుకుంది. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే, నీరసంగా ఉందని, పడుకుంటానని చెప్పింది. వాళ్లు చాలా రోజుల తర్వాత పొలానికి వెళ్లడంతో అలసిపోయుంటుందని భావించి మిన్నకుండిపోయారు. ఆదివారం తెల్లవారుజామున సైతం బాలిక మెత్తగా ఉండటంతో తల్లి ప్రశ్నించి, పరిశీలించగా ఒళ్లంతా రక్తస్రావమై ఉంది. విషయాన్ని కాస్త గట్టిగా అడగడంతో దుఃఖంతో జరిగిన ఘోరాన్ని చెప్పుకొచ్చింది. తల్లిదండ్రులు హుటాహుటిన బిడ్డను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన తాలూకా పోలీసులు సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. సోమవారం బాలిక తల్లిదండ్రులు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిని కలిసి జరిగిన ఘోరాన్ని చెప్పుకున్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ బాధితురాలికి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన చికిత్సలు అందించేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులతో సంప్రదించి మాట్లాడి, వెంటనే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా నిందితుడికి భార్య, నలుగురు పిల్లలు ఉండడం గమనార్హం.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: పట్టణంలోని ఎన్‌జిఒ కాలనీలో 8వ తరగతి చదువుతున్న లావణ (13) అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రాయచోటి మండల పరిధిలోని ఎండపల్లి గ్రామం కొత్తపల్లికి చెందిన రేకులకుంట మల్లికార్జున, అంజలి దంపతులు కొన్నేళ్లుగా రాయచోటిలో నివాసం ఉంటూ పిల్లలను చదివించు కుంటున్నారు. మల్లికార్జున బేల్దారి పనులు చేసుకుంటూ ఉండగా అతని భార్య అంజలి ఇండ్లలో పనులకు వెళ్తుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు కలరు. వీరంతా కొత్తపేట రామాపురంలోని జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. వీరిలో పెద్దపాప లావణ్య 8వ తరగతి చదువుతోంది. లావణ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని చనిపోయిందని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు గుట్టు చప్పుడు కాకుండా లావణ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు సిద్ధమవుతుండగా విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని బాలిక మృతిపై విచారణ చేపట్టారు. విద్యార్థిని లావణ్య మృతి చెందిన విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంఇఒ బాలాజీ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి జరిగిన ఘటనపై ఆరా తీశారు. పోలీసులు విద్యార్థిని లావణ్య తల్లిదండ్రులతోపాటు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను విచారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత

- ఆస్పత్రి సందర్శనలో వామపక్ష నాయకులు


ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని వారు సందర్శించారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత, అంబులెన్స్ కొరత కారణంగా యాక్సిడెంట్ కేసులు, ఇతర అత్యవసర రోగులను తిరుపతి, కడపలకు తరలిస్తున్న విషయాన్ని వారు సూపరిండెంట్ నాగేశ్వర రాజుతో ప్రస్తావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు, స్టాఫ్ సిబ్బంది లేరని, ప్రత్యేక విభాగాలలో కంటి, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్ వంటి కీలక విభాగాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోజులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సిటీ స్కానింగ్ వంటి ముఖ్యమైన రోగనిర్ధారణ పరికరాలు లేవని, తగినంత వైద్య సేవలు అందడం లేదని, పేదలకు మెరుగైన వైద్యం అందేలా వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. గర్భిణులకు సరైన వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందిస్తూ అన్ని అంశాలను పది రోజులలోపు పరిష్కరించి పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు, నాగేశ్వరరావు, రమణ, పెంచలయ్య, సిపిఎం నాయకులు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై 'రణభేరి' : యుటిఎఫ్

ప్రజాశక్తి-గాలివీడు

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యుటియఫ్ రణభేరి' జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జాబీర్ పిలుపు నిచ్చారు. సోమవారం గాలివీడులో బాలికల ఉన్నత పాఠశాల వద్ద రణభేరి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు రాయచోటిలో బైక్ ర్యాలీ రింగ్ రోడ్డు నుంచి డిఇఒ కార్యాలయం వరకు ఉంటుందని చెప్పారు. ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యకు పరిష్కారం చూపడం లేదని బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. మూడు నెలలుగా మినిమం టైం స్కేలు, టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రపంచబ్యాంక్ సాల్ట్ పథకం రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా 3వ వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయని, సగంపైన హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్టు టీచరు స్కూళుగా తయారయాయని తెలిపారు. హైస్కూళ్లలో పని చేయాల్సిన స్కూలు అసిస్టెంట్లు సర్ ప్లస్ పేరుతో క్లస్టరు టీచర్లుగా, ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారని తెలిపారు. నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రయివేట్‌కు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 'యోగాంధ్ర', 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్' అంటూ బోధనకు ఆటంకం కలిగించే పని కావాలని చేస్తున్నారని విమర్శించారు. 'ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్'కు పిలుపు ఇచ్చి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేయడం, అదే సమయంలో ట్రైనింగ్ పేరుతో ఉపాధ్యాయులను బడికి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా తల్లిదండ్రులకు, సమాజానికి ప్రభుత్వ బడి పట్ల నమ్మకం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను ఊపిరి అడకుండా చేస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ అప్లోడింగ్ కార్యక్రమంగా 'విద్యాశక్తి' కార్యక్రమాన్ని మార్చివేసి, స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. పరీక్షల మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేసారని వాపోయారు. మరోవైపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా ఇవ్వాల్సిన 12వ పిఆర్‌సి ఊసే లేదని, ఈ కాలంలో కనీసం ఒక్క డిఎ కూడా ఇవ్వకపోగా, వేలాది కోట్లుగా పేరుకుపోయి బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆర్థిక సమస్యలతో బాటు విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీకరించే పరిస్థితులను కల్పించాలని డిమాండ్ చేస్తూ యుటియఫ్ చేపట్టిన కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ మద్దతు ఇవ్వవలసిందిగా కోరారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శులు సురేంద్రరెడ్డి, నాయకులు మహబూబ్ బాషా, ఫయాజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రణభేరి సంబంధించిన కరపత్రంఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు


హిందీ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

హిందీ భాష ఐక్యతను ప్రతిబింబిస్తుంది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : హిందీ భాష దేశ సాంస్కృతిక ఐక్యతను ప్రతిబింబిస్తుందని ప్రధానోపాధ్యాయులు భారతి అన్నారు. మండల పరిధిలోని కొత్త బోయినపల్లి పిఎంఎస్‌జెఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ సెప్టెంబర్ 14న హిందీ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. హిందీ భాష ప్రచారానికి ఇది ముఖ్యమైన రోజు అన్నారు. హిందీ మన సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేస్తుందని తెలిపారు. భారతదేశంలో హిందీ సాహిత్యం కూడా గొప్ప కృషిని కలిగి ఉందని, ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు హిందీ సాహిత్యం సమాజానికి దిశానిర్దేశం చేసిన కబీర్, తులసీ దాస్, ప్రేమ్ చంద్, మహాదేవి వర్మ, ఇతర రచయితలు, కవులు హిందీ సాహిత్యాన్ని సుసం పన్నం చేశారన్నారు. ప్రముఖ హిందీ కవి బెయోహర్ రాజేంద్ర సింహ జయంతి సందర్భంగా హిందీ దివస్ నిర్వహించుకుంటున్నారని తెలిపారు. హిందీకి ప్రత్యేక హోదా కల్పించడంలో ముఖ్యమైన పాత్ర పోషించిన వారిలో గోవింద్ దాస్, హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలీ శరణ్ గుప్త వంటి వారు ఉన్నారన్నారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు ఎస్.వి.రామరాజు ముందస్తు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో భాగంగా పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు ఎస్.వి.రమణ రాజు, అమరావతి, ఓబులేసు, పి.జనార్ధన్, బి.శేషగిరి, శివప్రసాద్ గౌడ్, ప్రభాకర్ రావు, ఎం.చెన్నకేశవులు, పి.విజయబాస్కర్, శ్రీరాములు, అనిల్ కుమార్, రాజయ్య, ప్రణవి, సువర్ణ సుందరి, దార్ల శ్రీనివాసులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో పతకాల పంట

ప్రజాశక్తి-పీలేరు

12వ జాతీయ కరాటే పోటీల్లో పీలేరు విద్యార్థులకు పతకాల పంట పండిందని కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్ తెలిపారు. సోమవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ కర్నూలులో ఆదివారం జికెఎంఎ 12వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో సుమారు 12 రాష్ట్రాల నుంచి 1500 మంది క్రీడాకారులు హాజరయ్యారని చెప్పారు. పోటీలో గెలుపు అతికష్టమైనప్పటికీ, పీలేరు యోధా కరాటే అకాడమీకి చెందిన తమ విద్యార్థులు ప్రతిభను చాటారని చెప్పారు. వీరు కటా, ఫైట్ రెండు విభాగాల్లోనూ ఏడు బంగారు , 3 వెండి , 2 కాంస్య పతకాలను సాధించారని తెలియజేశారు. పోటీల్లో గీతాశ్రీ, వికాస్, ఫరూక్, ముదిత్ సాయి, సావన్, సహస్ర, అశ్విన్, పునీత్ తమ తమ వయసు, బరువు విభాగాలలో పాల్గొని విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.


జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన పీలేరు విద్యార్థులు



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఆక్రమణలను అరికట్టండి

ప్రజాశక్తి-కలికిరి

బోయకొండ గంగమ్మ గుడి చుట్టు ప్రక్క ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణను అరికట్టాలని వాడవాండ్లపల్లి గ్రామస్తులు తహశీల్దార్ హరికుమార్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలికిరి-కందూరు మెయిన్ రోడ్డు ప్రక్కన సుమారు 20 ఎకరాలు విస్తీర్ణంతో బోయకొండ గంగమ్మ గుడి వద్ద బండ ఉందన్నారు. ఆ బండపై మా పూర్వీకుల కొన్ని వందల సంవత్సరాలు క్రితం బోయకొండ గంగమ్మ దేవాలయం నిర్మించి ప్రతి సంవత్సరం ఘనంగా తిరుణాళ్ళు జరిపిస్తున్నామని తెలిపారు. తిరునాళ్లకు చుట్టుపక్కల గ్రామాలైన వాడవాండ్లపల్లి, కె.భారీనేపల్లి, నల్లగుట్ట దళితవాడ, ఆచార్ల గొల్లపల్లి, కొత్తపల్లి, బండకింద దళితవాడ, యల్లంపల్లి తదితర గ్రామాల నుండి చాందిని బండ్లు కట్టుకొని వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుండడంతో గుడి చుట్టు ప్రక్కల ఉన్న భూమిని దేవాలయానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ రెడ్డప్ప, వాడవలపల్లి గ్రామస్తులు, మాజీ ఎంపిటిసి ఏతేంద్ర యాదవ్, వెంకట సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల స్థాయిలో పాఠశాలల క్రీడా పోటీలను ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి పద్మావతి, నారాయణ, హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పాఠశాలల క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. నిమ్మనపల్లెలో అండర్-14 విభాగంలో, అండర్-17 విభాగంలో బాల,బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలను రెండు రోజులపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల (తెలుగు) క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. 17వ తేదీన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, బాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 18వ తేదీన పరుగు పందెం (అథ్లెటిక్స్) పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్, మున్సిపల్, మోడల్, గురుకుల అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ప్రధానోపాధ్యాయులచే ధృవీకరించబడ్డ మిడ్ డే మీల్ పత్రం, ఈవెంట్ ఎంట్రీ ఫార్మ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శారద, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి- కలకడ

పోలీసుస్టేషన్‌కు కుర్చీలు వితరణ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జగుంటపల్లికు చెందిన మల్లికార్జున నాయుడు మండలంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉంటూ, పారిశ్రామిక వేత్తగా ఎదిగారు. ఇతను ఉదార స్వభావంతో పోలీసుస్టేషన్‌కు 13 కుర్చీలను వితరణ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నట్లు తెలిపారు. ఈ కుర్చీల విలువ సుమారు రూ.16 వేలు ఉంటుందని తెలిపారు. ఉదార స్వభావం, దాతృత్వం, దానధర్మాలు చేసే వ్యక్తులలో మల్లికార్జున నాయుడు ఒక్కరుగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి దాతలు ముందుకు వచ్చి ఇలాంటి దాతృత్వ సేవలు చేయవలసిన అవసరం ఉందని కొనియాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను రెండు రోజులలో పూర్తి చేయాలని ఎంపిడిఒ రమేష్ బాబు సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులను సూచించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి స్వామిత్వ సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ మహిళా పోలీసులు, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రాచవేటివారిపల్లె, ఎగువ మాచిరెడ్డిగారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపల్లె లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను రెండు రోజులలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే చేస్తున్న అధికారులు ఒక్కొక్క పల్లెకు మూడు బృందాలుగా ఏర్పడి రోజుకు 100 చొప్పున సర్వే చేసి పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ సర్వే పూర్తి అయితే గ్రామాల అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని తెలిపారు. సర్వే చేస్తున్న పల్లెల్లో ముందు రోజే సమాచారాన్ని ప్రజలకు అధికారులు తెలియజేయాలన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్ద ఉండి సర్వే అధికారులకు వివరాలు తెలియజేసి సహకరించాలని తెలిపారు. స్వామిత్వ సర్వేపై జిల్లా అధికారుల నుంచి నిరంతర సమీక్ష జరుగుతున్నాదని అధికారులు దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేను వేగంగా పూర్తి చేయాలని వివరించారు.

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయచోటి

పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలకు నాణ్యతతో పరిష్కారం చూపాలని డిఆర్ఒ మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు .సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రజాసమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం ఎఒ నాగభూషణం, ఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను వింటున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

పశువులకు టీకాలు తప్పనిసరి



నిమ్మనపల్లె : టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధికి టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. సోమవారం రెడ్డివారిపల్లె పంచాయతీలోని రెడ్డివారిపల్లెలో గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సాధారణంగా పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు పశు వైద్యుల సూచనలను పాడి రైతులు తప్పక పాటించాలన్నారు. పశువులలో గిట్టల మధ్యలో పుండ్లు ఏర్పడడం, నాలుకపై బొమ్మలు రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. దీని వలన పశువులు మేత మేయక బక్క చిక్కిపోయి అనారోగ్యం బారినపడుతాయన్నారు. పాడి రైతులు అపోహలు వీడి ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలను వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి వైరస్ ద్వారా వ్యాపిస్తుందని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తామని పేర్కొన్నారు. టీకాలు వేయడం వలన రెండు రోజులు పాలు తగ్గడం సాధారణమేనని, తర్వాత యధావిధిగా ఆవు పాలు ఇస్తాయని తెలిపారు. పాడి రైతులు అపోహలు వీడి నాలుగు నెలలు పైబడిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టికాలను వేయించి విలువైన పశువులను కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గురురాజ్, గుర్రప్ప, బాబా పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** పశువులలో గాలికుంటు వ్యాధికి నిరోధక టీకాలు రైతులు తప్పనిసరి వేయించుకోవాలని పందిళ్ళపల్లి పశు వైద్య డాక్టర్ మహేష్ పేర్కొన్నారు. పందిళ్లపల్లెలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో గాలికుంటు వ్యాధి వలన తీవ్రమైన జ్వరం, నిరసించి పోవడం నోటి నుండి తీగల సొంగ కారడం, నోరు, గిట్టలు పుండ్లు కావడం కొద్దిపాటి ఎండకే రోప్పడం పశువులు తీసుకుపోవడం వంటి లక్షణాలు కనబడతాయని పేర్కొన్నారు. రైతులు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించుకున్నచో పశువులలో పాల ఉత్పత్తి పెంచి పని సామర్థ్యాన్ని మెరుగుపరచుకొని దూడలలో మరణాలు రేటు తగ్గించుకుని ఆరోగ్యంగా ఉండడానికి సహాయ పడతాయన్నారు టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. **తంబళ్లపల్లె :** గాలికుంటు వ్యాధి టీకాలు జాతీయ పశు వ్యాధి నివారణ పథకం కింద మండలంలోని 10,500 పాడి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ విక్రాంత్‌రెడ్డి అన్నారు. రెడ్డివారిపల్లెలో 84 పశువులకు గాలిగుంట టీకాలు వేసినట్టు తెలిపారు. **రాజంపేట అర్బన్:** పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు వై.విజయభాస్కరరావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని ములక్కాయలపల్లి, పట్టణ పరిధిలోని నూనెవారిపల్లెల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు మాట్లాడుతూ సోమవారం సుమారు 284 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. అక్టోబర్ 15 వరకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ మహిళా అధ్యక్షులు కె.అనసూయమ్మ, చెర్లోపల్లి పశువైద్యాధికారి కె.భాగ్యవతి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, ఎల్.ఎస్.ఎ.మణి, ఎల్‌హెచ్ఎ ప్రియాంక, రాజేంద్ర, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రాజంపేట : టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యుత్ జెఎసి నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

విద్యుత్ సంస్థలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర విద్యుత్ జెఎసి పిలుపుమేరకు సోమవారం విద్యుత్ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈనెల 15 నుంచి 22వ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డివిజన్ జెఎసి చైర్మన్ సయ్యద్ జాఫర్ వల్లి, డివిజన్ జెఎసినాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ళుగా కాంట్రాక్ట్ వర్కర్స్‌గా పనిచేస్తున్న కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలన్నారు. విద్యుత్ పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని, ఇపిఎఫ్ టు జిపిఎఫ్ వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్ లను సంస్థలో విలీనం చేసి పాత రెగ్యులేషన్స్ అమలు చేయాలని పేర్కొన్నారు. అర్హులైన ఒఅండ్ఎం తదితర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులను, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీర్ ఖాళీలలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. మంగళవారం కూడ నల్లరిబ్బన్లతో నిరసన తెలియజేసి, 17, 18 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు, 19, 20 తేదీలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టి 22న ర్యాలీతో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మణ్, పత్తి మురళీ, రామకృష్ణ, శేషాద్రినాగరాజ, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

మండలాలను రెవెన్యూ డివిజన్‌లో కలపాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

సుండుపల్లి, వీరబల్లి మండలాలను రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని సుండుపల్లె అఖిలపక్ష కమిటీ సభ్యులు వై.విశ్వనాథరెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అఖిలపక్ష కమిటీ సభ్యులతో కలిసి డిఆర్ఒ మధుసూదన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లె, వీరబల్లి మండలాలు రాజంపేట రెవెన్యూ డివిజన్‌లలో కొనసాగుతున్నాయని చెప్పారు. ఆ మండలాలకు రాజంపేట రెవెన్యూ డివిజన్ చాలా దూరం అన్నారు. డివిజన్ కేంద్రానికి వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేదన్నారు. పై మండలాల ప్రజలకు రాయచోటి పట్టణం అన్ని రకాల అందుబాటులో ఉంటుందన్నారు. పూర్తిస్థాయి రవాణా సౌకర్యం ఉందన్నారు. సుండుపల్లి, వీరబల్లి మండలాలను ప్రజల ఆకాంక్ష మేరకు రాయచోటి డివిజన్‌లో కలపాలని కోరారు.

వైద్య కళాశాలను ప్రజలకు అంకితం చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ప్రజల సొమ్ముతో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రజలు అంకితం చేయాలని వైసిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అనుమతులు సాధించి నిర్మించిన మెడికల్ కళాశాలలను అనేక రకాల సాకులు చూపుతూ పిపిపి విధానంలో తమ బినామీలైన ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తుండడం దారుణ మన్నారు. ఎపిలో కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఎన్ఎంసి అనుమతించిందన్నారు. ఎవరైనా ప్రయివేట్ వ్యక్తులు సొంతంగా మెడికల్ కళాశాలలు పెట్టుకో వచ్చు అన్నారు. అంతే కానీ, ఏకంగా ఉన్న వైద్య కళాశాలలను వారికి దారాదత్తం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి కష్టపడి ఎన్ఎంసి అనుమతులు సాధించి ప్రభుత్వ సొమ్ముతో మెడికల్ కాలేజీలు నిర్మింపచేస్తే వాటిని చంద్రబాబు ప్రయిపరం చేసేందుకు ప్రయత్నిస్తుండడం సిగ్గు చేటు అన్నారు. ఇప్పటి కైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి నాయకులు శివశంకర్ యాదవ్, బుజ్జిబాబు, నవాజ్ క్రిష్, యూసఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

టెట్ నిర్వహించడం సరికాదు

ప్రజాశక్తి - రాయచోటి

సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించడం సరికాదని ఆపస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారీ మధుసూదన్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఈనెల 1న ఇచ్చిన తీర్పు ప్రకారం సేవలో ఉన్న ఉపాధ్యాయులందరికీ టీచర్ ఎలిజిబిలిటీ టెట్ తప్పనిసరి చేసిన నిర్ణయం కారణంగా, లక్షలాది మంది ఉపాధ్యాయుల భవిష్యత్, జీవనోపాధి అనిశ్చితిలో పడిందిన్నారు. అనేక పరీక్షలలో నెగ్గి , ఉపాధ్యాయ వృత్తిలో దీర్ఘ కాలంగా కొనసాగుతున్న వారిని టెట్ రాయమనడం ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని అవమానించినట్టు అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల గౌరవం, సర్వీసు భద్రతను కాపాడటానికి ప్రధాన మంత్రి తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామి రెడ్డి, జిల్లా కార్యదర్శి బాలాజీ, ఆపస్ నాయకులు భూషణయ్య ,మోహన్ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని కృష్ణ నగర్‌లో 640 సర్వే నెంబర్‌లో అదే వీధికి చెందిన గుత్తా చెంగయ్య నాయుడు కుటుంబ సభ్యులు రోడ్డు ఆక్రమించుకుని పనులు చేపడుతుండగా సోమవారం కృష్ణానగర్ వాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ భావనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కృష్ణానగర్ వాసులు మాట్లాడుతూ ఆక్రమణదారులు 824 సర్వే నెంబర్‌లో ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొచ్చి 640 సర్వేనంబర్ కూడా తమదేనంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. దశాబ్దాలకాలంగా రోడ్డు ఉన్నప్పటికీ రోడ్డు లేదంటూ అక్కడ ఉన్న చెట్లను సైతం నరికి వేసి పనులు ప్రారంభించారని తెలిపారు. 2011లో ఆర్‌డిఒ, తహశీల్దార్, సర్వేయర్లు సర్వేలు నిర్వహించి నివేదిక కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ నివేదికను సబ్ కలెక్టర్‌కు చూపించారు. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ విచారించి సత్వర చర్యలు తీసుకోవాల్సిందిగా రాజంపేట తహసిల్దార్ పీర్ మున్నీని ఆదేశించారు. సర్వే చేసి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామని తహశీల్దార్ వారికి హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. కాగా అనుమతులు లేకుండా గుత్తా చంగయ్య నాయుడు కుటుంబ సభ్యులు చెట్లను నరికి వేయడంపై అటవీ శాఖ అధికారులు స్పందించి అక్కడ పనిచేస్తున్న యంత్రాలను తీసుకెళ్లడంతో పాటు సదరు వ్యక్తులపై అటవీశాఖ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.కార్యక్రమంలో కృష్ణానగర్ ప్రజలు గుణకల సుబ్బరాయుడు, నరసింహులు, శ్రీనివాసులు, రమేష్ బాబు పాల్గొన్నారు.

సశక్త్ పరివార్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి రాయచోటి అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్ర మం విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య కోరారు. సోమవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో వివిధ విభాగాల ప్రోగ్రాం ఆఫీసర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పథకం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయాను కూల వైద్య సేవలను అందించడం, పోషకా హారాన్ని ప్రోత్సహించడం పథకం ము ఖ్య ఉద్దేశాలు అన్నారు. పథకం కింద జిల్లా లోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను, ప్రత్యేక వైద్యనిపుణులు, పారామెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమం విజయవంతానికి వైద్యారోగ్య శాఖ అధికా రులు సిబ్బందిలు కృషి చేయాలని కోరారు. **రామాపురం :** స్వస్త్ నారి సశక్తి అభియాన్ పథకంపై గ్రామాలలో మహిళలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి పథకం అమలుపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా డాక్టర్ దివ్యశ్రీ, ఎంఎల్‌హెచ్‌బి హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో నూతన మెడికల్ కళాశాలల విషయంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, వాటిని మానుకోవాలని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేశ్ విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనా కాలంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మించి, తామే పేద విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తామని నమ్మబలికిందన్నారు. వాస్తవానికి నాబార్డ్ బ్యాంక్ నుండి రూ.3731 కోట్ల రుణం తీసుకుని, కేంద్ర ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించి, విచ్చలవిడిగా దుర్వినియోగం చేసి, సంక్షేమ పథకాలను దారి మళ్లించడం ద్వారా మెడికల్ కళాశాలలు కేవలం పునాదులకే పరిమితమయ్యాయని ఆరోపించారు. నిర్మాణాలు చోటు చేసుకుని మొదటి ఏడాది తరగతులు ప్రారంభమైన ఒకటి, రెండు కళాశాలలో రెండవ ఏడాది తరగతులకు గదులు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పి-4 విధానం ద్వారా 10 మెడికల్ కళాశాలల నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. నిధుల కొరతను అధిగమించి మెడికల్ కళాశాలలను సకాలంలో పూర్తి చేయడానికే పి-4 విధానానికి శ్రీకారం చుటిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం హయాంలో మెడికల్ కళాశాలలో పూర్తి అయ్యుంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. పి-ఫోర్ విధానంతో రిజర్వేషన్లకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఒపి విధానం అంతా ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటుందన్నారు. వైసిపి నాయకులు, వాస్తవాలు గ్రహించి పిఫోర్‌పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపిడిఒ రమేష్ బాబు పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. సోమవారం డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి నిమ్మనపల్లె పంచాయతీ కార్యదర్శులతో, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా తగు చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. నిమ్మనపల్లెలో పారిశుధ్యం మెరుగుపడాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల లోపు పారిశుధ్యం పనులను పారిశుధ్య కార్మికులు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. నిమ్మనపల్లి బస్టాండు ఆవరణంలో దుకాణదారులు చెత్తను రోడ్డుపై వేయకుండా పంచాయతీ కార్యదర్శులు దుకాణదారులకు తెలియజేయాలన్నారు. టీ దుకాణాలు, పానీ పూరి దుకాణాలు, బేకరీలు, పూల అంగళ్ళ వద్ద అధికంగా చెత్త రోడ్డుపై పడుతున్నాదని తెలిపారు. ప్రతిరోజు చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని, మురుగునీటి కాలువ గట్లపై ఉన్న గడ్డిని వెంటనే తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారి చేయాలన్నారు. పారిశుధ్యంపై ఫిర్యాదులు అందితే సంబంధించిన పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మండల వ్యవసాయాధికారిగా ప్రవీణ్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల వ్యవసాయ శాఖ అధికారిగా ఎస్.ప్రవీణ్ పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. చింతకొమ్మదిన్నె మండల వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై పుల్లంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. యూరియా అందుబాటులో ఉందన్నారు. మండలంలో అత్యధికంగా ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. వాటికి అనుగుణంగా రైతులు సాంకేతిక వ్యవసాయాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. సాంకేతిక పద్ధతుల విషయంలో వ్యవసాయ అధికారి, రైతు సేవా కేంద్ర సిబ్బందిని రైతులు సంప్రదించాలన్నారు. రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఘర్షణ కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

ఘర్షణ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని ముడియంవారిపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన గంగిరెడ్డి, గట్టు వెంకటరమణ గ్రూపులు కలసి భూ తగాదాలతో ఈ నెల 10వ తేదీన ఘర్షణ పడ్డారు. ఈ కేసులో ఘర్షణలో గట్టు వెంకటరమణ, ఆయన కుమారుడు ప్రవీణ్, భార్య సుబ్బులమలను, అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి అతని కుమారుడు ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి భార్య పుష్పవతి, బంధువు శ్రీనివాసులురెడ్డి కలసి కొడవళ్ళు, కర్రలతో దాడి చేసి రక్త గాయాలు చేసిన విషయంపై ఈ నెల 11వ తేదీన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘర్షణలో నిందితులైన గంగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అతని భార్య పుష్పావతి, శ్రీనివాసులురెడ్డిలను కోన క్రాస్ వద్ద ఉండగా అరెస్టు చేశామని తెలిపారు. వారిని వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన సోమవారం పిటిఎం మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కందుకూరు మండలం, గొల్లపల్లికి చెందిన మధు భార్య గాయత్రి (33) కుటుంబ సమస్యలపై గొడవ పడింది. దీంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. పిటిఎం పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు.. పట్టణంలోని నీరుగట్టువారి పల్లెకు చెందిన ఆనంద్ (58) మదనపల్లె మండలం, పోతుబోలు సమీపంలోని శ్రీవేద ప్రయివేట్ పాఠశాలలో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు ఉదయం ఇంటినుండి ద్విచక్ర వాహనంలో పాఠశాలకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని తురకపల్లె వద్ద ఎదురుగా కుక్క అడ్డు రావడంతో తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని గమనించిన స్థానికులు వెంటనే 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

మిద్దె పైనుంచి పడి మరో వ్యక్తికి...

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మిద్దెపై నుంచి పడిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం బి. కొట్టుకోట మండలంలో చోటు చేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దయ్యాలవారిపల్లి చెందిన రెడ్డిశేఖర్ (45) మిద్దె పైకి వెళ్లి కిందకి దిగుతుండగా ప్రమాదవ శాత్తు కాలుజారి కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమ నించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని 24 గంటలు అబ్జర్వేషన్‌లో పెట్టాలని వైద్యులు చెప్పారు.

పాత కక్షలతో మహిళపై దాడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాత గొడవలను మనసులో పెట్టుకొని ఆదివారం రాత్రి ఇంటి నుండి దుకాణానికి వచ్చి కావాల్సిన వస్తువులు తీసుకుని తిరిగి ఇంటికి వెళ్లే మార్గ మధ్యంలో దారిలో కాపు కాచి మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని చెంచు కాలనీలో నివాసం ఉండే అలివేలు (20) ఆదివారం రాత్రి అన్నమయ్య నగర్‌లో ఉన్న దుకాణానికి వచ్చి కావాల్సిన వస్తువులు తీసుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో కాపుకాచి అదేనగర్‌కు చెందిన వైసిపి నాయకులు రాగే చౌడయ్యతో పాటు మరొకరు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయం కావడంతో మున్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి గాయపడిన మహిళ అలివేలును ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకొచ్చామని బాధితురాలి తాత సింగనమైన సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ అని చూడకుండా ఎక్కడపడితే అక్కడ కాళ్లతో తన్ని తీవ్రంగా గాయపరిచారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి తరపున అలివేలి భర్త చిరంజీవి ఎల్లాగడ్డ పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా కూర్చున్నందుకు, ఈనెల 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బోయినపల్లి పర్యటనకు రావడంతో దారి పొడుగునా టిడిపి జెండాలు కట్టడంతో దానిని చూసి ఓర్చుకోలేక వైసిపి నాయకులు దాడికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో మాపై అక్రమంగా 18 కేసులు పెట్టించారన్నారు. ఓవైపు కుటుంబాన్ని పోషిస్తూనే.. మరోవైపు కోర్టు చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.